ఈనాడు అల్లూరి సీతారామరాజు

చేయి చేయి కలిపారు.. చెక్‌డ్యాం బాగుచేసుకున్నారు!

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు బెన్నవరం పంచాయతీ గచ్చుపల్లి వద్దనున్న చెక్‌డ్యాం కొట్టుకుపోయి శిథిలావస్థకు చేరుకుంది. ఎవరో వస్తారని ఎదురుచూడకుండా గ్రామానికి చెందిన యువకులు, పెద్దలు చేయి చేయి కలిపి దీన్ని బాగు చేసుకున్నారు. చెక్‌డ్యాంపై మేట వేసిన బురద, మట్టిని తొలగించారు. రంధ్రాలను మూశారు. రోజంతా కష్టపడినా సాగునీరు వృథాగా పోతోందని గ్రామస్థులు గెమ్మెలి చిన్నారావు, శంకరరావు, కొర్రా అప్పారావు ఆవేదన వ్యక్తంచేశారు. ఈ గ్రామంలో సుమారు 100 గిరిజన కుటుంబాలు ఈ చెక్‌డ్యాంపై ఆధారపడి సాగు చేపడుతున్నాయి. ప్రజాప్రతినిధులు, సంబంధిత అధికారులు స్పందించి ఈ చెక్‌డ్యాంకు శాశ్వత మరమ్మతులు చేయాలని గ్రామస్థులు కోరుతున్నారు. రాందాసు, పరమేశ్వరరావు, బాబూరావు, లక్ష్మణ్, రవి తదితరులు పాల్గొన్నారు. –న్యూస్‌టుడే, చింతపల్లి గ్రామీణం



గచ్చుపల్లి గ్రామ గిరిజనుల శ్రమదానం

పాడేరులో నేడు పర్యటక దినోత్సవం

పాడేరు, న్యూస్‌టుడే: ఈ నెల 27న ప్రపంచ పర్యటక దినోత్సవాన్ని కలెక్టరేట్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా పర్యటక మండలి అధ్యక్షులు, కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. స్థానిక తలారిసింగి కూడలి నుంచి కలెక్టరేట్ వరకు గిరిజన జానపద నృత్యాలు, సంగీత వాయిద్యాలతో ఊరేగింపు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో వేడుకలు జరుగుతాయన్నారు.

ఎన్నో అందాలు.. ఎంతో నిర్లక్ష్యం

★ వైకాపా పాలనలో పర్యాటకాభివృద్ధి శూన్యం

★ కూటమి ప్రభుత్వంపైనే ఆశలు

ఈనాడు, పాడేరు, న్యూస్‌టుడే, పాడేరు పట్టణం, అరకులోయ



మన్యంలో పర్యటకుల మనసు చూరగొనే ప్రకృతి అందాలు ఎన్నో ఉన్నాయి. వీటి అభివృద్ధిపై గత వైకాపా ప్రభుత్వం శీతకన్ను వేసింది. పర్యటక కేంద్రాల అభివృద్ధికి కేంద్రం ప్రభుత్వం మంజూరు చేసిన రూ.కోట్లాది నిధులను పక్కదారి పట్టించింది. ఎన్డీయే ప్రభుత్వం ఈ రంగం అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తుండడం శుభపరిణామం.

» జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, పాడేరు, రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారులు పర్యటక రంగం అభివృద్ధికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు. స్వదేశీ దర్శన్ పేరుతో పర్యటక సర్క్యూట్ ఏర్పాటు చేసి కొత్త ప్రదేశాలను గుర్తిస్తున్నారు. ఇప్పటికే బొర్రా గుహల అభివృద్ధికి రూ.30 కోట్లు నిధులు మంజూరయ్యాయి. డుంబ్రిగుడ మండలం అంజోడా సిల్క్‌ఫాంలో నాలుగున్నర ఎకరాల్లో కార్‌వాస్ పార్కు ఏర్పాటు, మేఘాలకొండకు రూ.2.3 కోట్లతో తారురోడ్డు మంజూరు, డల్లాపల్లికి తారురోడ్డు నిర్మాణం, కొత్త ప్రదేశాల అన్వేషణకు మండల స్థాయి కమిటీలు ఏర్పాటు చేశారు. ఆయా ప్రదేశాల అభివృద్ధికి నిధులు కేటాయించేలా చర్యలు తీసుకుంటున్నారు.

» అరకులోయ మండలం కొత్తవలస వ్యవసాయ ప్రదర్శన క్షేత్రంలో ఏడెకరాల విస్తీర్ణంలో పర్యటకాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ఎనిమిదేళ్ల కిందట రూ. 7.7 కోట్లు కేటాయించింది. ఈ నిధులతో ఈట్ స్ట్రీట్, స్థానిక గిరిజన చేతివృత్తుల కళాకారుల కోసం క్రాఫ్ట్ బజార్ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అప్పటి తెదేపా ప్రభుత్వం పనులను ప్రారంభించింది. ఈట్ స్ట్రీట్, క్రాఫ్ట్‌బజార్‌లను లింటెల్ దశ వరకు తెదేపా ప్రభుత్వ హయాంలో నిర్మించారు. తర్వాత ఏర్పడిన వైకాపా ప్రభుత్వం వీటిని పట్టించుకోలేదు.

» అరకులోయలోని పున్నమి వేలీ రిసార్ట్సు ఆవరణలో 2018లో తెదేపా ప్రభుత్వ హయాంలో రూ. 2 కోట్లతో డ్రైవ్ ఇన్ రెస్టారెంట్ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. వైకాపా ప్రభుత్వం వచ్చాక 2019లో అప్పటి పర్యటకశాఖ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు దీన్ని ప్రారంభించారు. అనంతరం దీన్ని ఉపయోగంలోకి తీసుకురావడానికి వైకాపా ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో నేటికీ నిరుపయోగంగా ఉంది.



అరకులోయలో వినియోగంలోకి రాని డ్రైవ్ ఇన్ రెస్టారెంట్

» పాడేరు పట్టణానికి ఏడు కిలోమీటర్ల దూరంలో వంజంగి మేఘాల కొండ వైకాపా ప్రభుత్వంలో పూర్తిగా నిర్లక్ష్యానికి గురైంది. ఇక్కడ రోప్‌వేతోపాటు కాటేజీలు, రిసార్టులు నిర్మిస్తామని అప్పటి మంత్రులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, అమర్‌నాథ్, ఎంపీ మాధవి అనేక హామీలు ఇచ్చారు. అవేవీ కార్యరూపం దాల్చలేదు. రూ.50 లక్షలతో ఎకో టూరిజం ఏర్పాటు చేస్తామని ప్రతిపాదించారు. అదీ అమలుకు నోటుకోలేదు. కొత్తపల్లి జలపాతం, డల్లాపల్లి అభివృద్ధిని పట్టించుకోలేదు.



కొత్తవలసలో అసంపూర్తిగా ఈట్ స్ట్రీట్ నిర్మాణాలు


ఆదాయ వనరు » అల్లూరి జిల్లాకు పర్యటక రంగం ద్వారా అధిక ఆదాయం వస్తుంది. ఈ రంగానికి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమివ్వాల్సిన అవసరముంది. లంబసింగిలో ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న గిరిజన మ్యూజియం పనులు పూర్తి చేస్తే సందర్శకుల తాకిడి పెరుగుతుంది. మేఘాలకొండకు సమీపంలోని పాడేరులో రిసార్టులు నిర్మించాల్సి ఉంది. మేఘాలకొండకు తారురోడ్డుతోపాటు మరుగుదొడ్లు, ఇతర సదుపాయాలు కల్పించాలి. అరకులోయ, బొర్రాగుహలు, అరకు మ్యూజియం, పద్మాపురం గార్డెన్, చాపరాయి, కటికి జలపాతం, తాజంగి, డల్లాపల్లి వంటి ప్రదేశాల్లో అదనపు హంగులు కల్పిస్తే పర్యటకుల తాకిడి పెరుగుతుంది.

చింతపల్లి, న్యూస్‌టుడే

చింతపల్లి మండలం చెరువులవెనం వ్యూపాయింట్‌కు దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో పర్యటకులు తరలివస్తున్నారు. కొండ పైకి వెళ్లేందుకు నేటికీ సరైన రహదారి లేదు. ఇక్కడకు రోడ్డు సదుపాయం కల్పించాలి.



తాజంగిలో నిర్మాణంలో ఉన్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం



పాలకడలిని తలపిస్తున్న చెరువులవెనం అందాలు

★ గూడెంకొత్తవీధి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో చారిత్రక నేపథ్యం కల్గిన పాండవుల విగ్రహాలు ఉన్నాయి. పురావస్తుశాఖ, పర్యటకశాఖలు ఇప్పటివరకూ వీటివైపు కన్నెత్తి కూడా చూడలేదు. స్థానికులు కార్తిక మాసం, అడవిరాజులబాబు పండుగల సమయాల్లో ఈ విగ్రహాల వద్ద వన భోజనాలు చేస్తుంటారు. ఇక్కడకు సమీపంలోనే దోనిగుమ్ముల జలపాతం ఉంది. ఇది పర్యటకులను అమితంగా ఆకర్షిస్తోంది. జలపాతం వరకూ వెళ్లేందుకు రహదారిని నిర్మించాలని కొంతకాలంగా ఈ ప్రాంతీయులు కోరుతున్నా ఇప్పటివరకూ ఎటువంటి కదలికా లేదు.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే

మారేడుమిల్లిలోని పర్యటక ప్రదేశాల్లో పర్యటకులకు కనీస సదుపాయాలు కరవయ్యాయి. కమ్యూనిటీ బేస్డ్ ఎకో-టూరిజంలో భాగంగా మారేడుమిల్లి, వాలమూరు, టైగర్‌క్యాంపు ప్రాంతాలతో పాటు, గుడిస కొండను పర్యటకంగా అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఈ ప్రాంతానికి నిత్యం వేలాది సంఖ్యలో పర్యటకులు వస్తున్నారు. ఆయా ప్రదేశాల్లో పర్యటకులకు కనీస సదుపాయాలు కల్పించడంలో విఫలమయ్యారు. గుడిస కొండపై ఎటువంటి సదుపాయాలు లేవు. కనీసం రహదారి కూడా లేకపోవడంతో తరచూ వాహనాలు ప్రమాదాలకు గురవుతున్నాయి. కొండపై కనీసం తాగునీరు కూడా అందుబాటులో లేదు. పాములేరు వాగులో ఎన్నో ప్రమాదాలు చోటుచేసుకున్నాయి.



గుడిస కొండపైకి వెళ్లే రహదారి

మారేడుమిల్లి నుంచి చింతూరు ఘాట్‌రోడ్డులోని 'అమృతధార' జలపాతం వద్ద రక్షణ చర్యలు లేకపోవడంతో ప్రమాదకరంగా మారింది. గుడిస కొండపైకి సిమెంటు రోడ్డుతోపాటు పుల్లంగి నుంచి కొండ వరకు తారురోడ్డు నిర్మించాల్సి ఉంది. ఇది లేకపోవడంతో ప్రైవేటు వాహనదారులు ఇష్టానుసారంగా పర్యటకుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు.



అధ్వాన దారిలో వాహనాల అవస్థలు

బోర్డులు పెట్టి ఊరుకున్నారు..

మన్యంలో పర్యటకశాఖ చేసిన అభివృద్ధి అంటూ ప్రత్యేకంగా ఏదీ లేదు. ఇప్పటికే గుర్తింపు పొందిన పలు పర్యటక ప్రాంతాల వద్ద బోర్డులు ఏర్పాటు చేసి మమ అనిపించారు.

అరచేతిలో ఉపాధి సమాచారం

అందుబాటులోకి జన్‌మన్ నరేగా యాప్

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే

ఉపాధి హామీ పథకంలో అక్రమాలకు తావులేకుండా పారదర్శకత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చాయి. కూలీల వేతనాలు దుర్వినియోగం కాకుండా సదరు కూలీ ఖాతాకు నేరుగా అందించడానికి బ్యాంకు, పోస్టాఫీసు ఖాతాలను తెరిచి వాటి ద్వారా చెల్లింపులు చేస్తున్నారు. కూలీలు ఒకప్పుడు తమ వేతనం ఖాతాలో జమ అయ్యిందో లేదో తెలుసుకునేందుకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. ఎంపీడీవో, తపాలా కార్యాలయాలకు వెళ్లాల్సి వచ్చేది. ఇలాంటి వాటి నుంచి బయట పడేసేందుకు కేంద్ర ప్రభుత్వం అరచేతిలో సమగ్ర సమాచారం తెలుసుకొనేలా ప్రత్యేకంగా యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. చరవాణి ఉన్న ప్రతి ఒక్కరు గూగుల్ ప్లే స్టోర్ నుంచి 'జన్‌మన్ నరేగా' యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. గ్రామీణ ప్రాంతాల్లో సైతం సాంకేతికత అభివృద్ధి చెందుతున్న తరుణంలో ఈ యాప్‌పై అధికారులు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాల్సి ఉంది.

జిల్లాలో ఉపాధి వివరాలు..

- జాబ్‌కార్డులు: 2.41 లక్షలు
- కూలీలు: 4.62 లక్షలు
- 100 రోజులు పూర్తయిన కుటుంబాలు: 18,408

ఎలా వినియోగించాలంటే...

ప్లే స్టోర్ నుంచి జన్‌మన్ నరేగా అనే యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. కూలీల వేతనాలు, పని దినాలకు సంబంధించిన ఐచ్ఛికాన్ని ఎంపిక చేయాలి. రాష్ట్రం, జిల్లా, మండలం, పంచాయతీ, కుటుంబ ఐడీ వివరాలు నమోదు చేయాలి. పేమెంట్ ఐచ్ఛికానికి వెళ్లి వ్యక్తి పేరు మీద ఎంపిక చేస్తే ఎక్కడ పనిచేశారు. పని సంఖ్య తదితర వివరాలతో పాటు వేతనాలు ఎంత, ఎప్పుడు జమ చేశారు. ఏ బ్యాంకులో జమ చేశారో తెలుస్తుంది.

ఫిర్యాదు చేసేందుకు అవకాశం....

ఉపాధి పనులు కింద తప్పనిసరిగా నిర్వహించాల్సిన ఏడు రిజిస్టర్లు, అలాగే కూలీల పది హక్కులు అందుబాటులో ఉన్నాయి. ఇది దాదాపు 11 ప్రాంతీయ భాషల్లో అందుబాటులో ఉంది. పనులు తెలుసుకోవడంతోపాటు అక్రమాలపై సైతం యాప్‌లో ఫిర్యాదు చేయడానికి అవకాశం కల్పించారు.

★ **వివరాలన్నీ తెల్సుకోవచ్చు..:** పనుల్లో పూర్తి పారదర్శకత కోసం యాప్ ద్వారా సమాచారమంతా అందుబాటులోకి వచ్చింది. పనులు ఎన్ని రోజులు చేశారు. ఎంత వచ్చింది. ఏ బ్యాంకులో పడిందనే సమాచారం దీనిలో నేరుగా తెల్సుకోవచ్చును. ఎవరైనా సరే ఈ యాప్ ద్వారా వివరాలు క్షణాల్లో తెలుసుకోవచ్చు.

– ఎల్.రాంబాబు, డ్వామా ఏపీడీ, అడ్డతీగల క్లస్టర్



యాప్ ముఖచిత్రం

అనుసంధానం అయిందో లేదో..:

ఉపాధి వేతనాలు జమ కాకపోతే లబ్ధిదారుని ఖాతాకు ఆధార్ అనుసంధానం అయిందో లేదో, ఆధార్‌లో పోలిన విధంగా బ్యాంకు వివరాలు ఉన్నాయా. ఆధార్ పేమెంట్ బ్రిడ్జి సిస్టం (ఏపీబీఎస్) లింక్ అయిందా లేదా అనే వివరాలు ఉంటాయి. ఒకవేళ అన్నిటికి లింకైతే పచ్చ రంగులో రైట్ గుర్తు లేకుంటే దేనికి కాలేదో అక్కడ ఎర్ర రంగులో తప్పు గుర్తు కనిపిస్తుంది. జాబ్ కార్డులోని కుటుంబ సభ్యులు ఎవరెవరు ఈ ఆర్థిక సంవత్సరంలో ఎన్ని రోజులు పనిచేశారనే వివరాలు కనిపిస్తాయి.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన

ఎమ్మెల్యే శిరీషాదేవి

రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి అన్నారు. మండలంలోని చికిలింత, వాతంగి, లోదొడ్డి గ్రామాల్లో గురువారం 'ఇది మంచి ప్రభుత్వం' పేరుతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలపై బ్రోచర్ ఆవిష్కరించారు. ఇంటింటికి వెళ్లి వంద రోజుల పాలనపై స్టిక్కర్లను అతికించారు. వాతంగిలో కేకు కోశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గిరిజన గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషిచేస్తోందన్నారు. వంద రోజుల పాలనలో సమూల మార్పులు తీసుకొచ్చామన్నారు. సర్పంచులు కె.సూరిబాబు, ఎల్.రామారావు, నియోజకవర్గ తెదేపా పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, తెదేపా, జనసేన, భాజపా మండల అధ్యక్షులు జి.పెద్దిరాజు, బి.త్రిమూర్తులు, టి.సూరిబాబు, మాజీ ఎంపీపీ ఆర్.రమణ, తెదేపా మండల మహిళా అధ్యక్షురాలు ఎం.సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



లోదొడ్డిలో సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిరీషాదేవి, కూటమి నాయకులు

మాదకద్రవ్యాలకు దూరంగా ఉండండి

అరకులోయ, న్యూస్‌టుడే: యువత మాదకద్రవ్యాల జోలికి పోకుండా భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని శిక్షణ డీఎస్పీ ఉషశ్రీ అన్నారు. అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గంజాయి రవాణా చేసినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. యువత వీటన్నింటికీ దూరంగా ఉండి బాగా చదువుకోవాలని సూచించారు. గ్రామాల్లో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. సీఐ హిమగిరి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శిక్షణ డీఎస్పీ ఉషశ్రీ, చిత్రంలో సీఐ హిమగిరి

అంధకారంలో మగ్గుతున్నాం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రొంపల్లి పంచాయతీ పరిధిలోని మంగలిపేట, గెడ్డే గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని కోరుతూ ఆయా గ్రామస్థులు కాగడాలతో నిరసన చేపట్టారు. ఈ రెండు గ్రామాల్లో సుమారు 100 మంది వరకు నివాసం ఉంటున్నారని సీపీఎం నాయకులు కె. గోవిందరావు తెలిపారు. అటవీ ప్రాంతంలో అంధకారంలో కాలం వెళ్లదీస్తున్నారని, ఆయా గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. దీపాల వెలుగులో భోజనాలు చేయాల్సి వస్తోందని పేర్కొన్నారు. గ్రామస్థులు కోటపర్తి సింహాచలం, సెంపీ శ్రీను, ధర్మయ్య, శంకరరావు తదితరులు పాల్గొన్నారు.



కాగడాలతో గిరిజనుల నిరసన

ఉద్యోగ మేళా 30న

రంపచోడవరం, న్యూస్‌టుడే: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సిడాప్ సంయుక్తంగా స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ నెల 30న జాబ్‌మేళాను నిర్వహిస్తున్నాయని ప్రిన్సిపల్ డాక్టరు చిట్టిబాబు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు జరిగే ఈ జాబ్‌మేళాలో ప్రముఖమైన ఐదు కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. 18 నుంచి 30 ఏళ్ల వయస్సు కలిగి పది, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు డిప్లమో, బీటెక్ చదివివారంతా హాజరు కావొచ్చన్నారు. అభ్యర్థులు విద్యార్హత ధ్రువపత్రాలతోపాటు ఆధార్ కార్డును తీసుకురావాలని కోరారు.

నేటి మీకోసం రద్దు

పాడేరు, న్యూస్‌టుడే: ఈ నెల 27వ తేదీన మీకోసం కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ దినేష్‌కుమార్ గురువారం తెలిపారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఈ కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు ప్రకటించారు.





గతంలో గోతులతో నిండిన రహదారి... ఆర్టీసీ కాంప్లెక్స్ మార్గంలో సీసీ రోడ్డు నిర్మాణం

ఐదేళ్ల అవస్థలకు చెల్లు

అరకులోయ, న్యూస్‌టుడే: అరకులోయ ఆర్టీసీ కాంప్లెక్స్‌కి వెళ్లే రహదారి ఐటీడీఏ పీవో అభిషేక్ చొరవతో ఎట్టకేలకు బాగుపడింది. ఈ రహదారి ఐదేళ్ల నుంచి భారీ గుంతలతో నిండి వర్షాకాలంలో చెరువు తలపించేది. ఈ సమస్యని స్వయంగా పరిశీలించిన ఐటీడీఏ పీవో అభిషేక్ ప్రత్యేక దృష్టి సారించి ఉపాధిహామీ నిధులు రూ. 39 లక్షలతో సీసీ రోడ్డు, వర్షపు నీరు నిల్వ ఉండకుండా రూ. 26 లక్షలతో కాలువ నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ప్రస్తుతం పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఐదేళ్లపాటు గుంతల రహదారితో అవస్థలు పడిన ప్రజలు.. సీసీ రోడ్డు నిర్మాణం అందుబాటులోకి వస్తుండటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మంత్రి లోకేశ్‌ను కలిసిన ఈశ్వరి


మంత్రి లోకేష్‌తో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి

పాడేరు, న్యూస్‌టుడే: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్‌ను గురువారం విశాఖపట్నంలో పాడేరు మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి మర్యాదపూర్వకంగా కలిశారు. పాడేరు నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిని ఆయనకు వివరించారు. నియోజకవర్గంలో సమస్యలు, చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, పార్టీ బలోపేతం కోసం చేస్తున్న కృషిని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.

2న ఏకలవ్య పాఠశాలల ప్రారంభోత్సవం

పాడేరు, న్యూస్‌టుడే: గిరిపుత్రులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో నూతనంగా నిర్మించిన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలను అక్టోబర్ 2న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభిస్తారని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ గురువారం తెలిపారు. ఝార్ఖండ్ నుంచి వర్చువల్‌గా పెదబయలు, అరకులోయ మండలాల్లో రూ.40 కోట్ల వ్యయంతో నిర్మించిన పాఠశాలలను ప్రారంభిస్తారని చెప్పారు. అనంతరం చింతపల్లి, హుకుంపేట మండలాల్లో మరో రూ.40 కోట్లతో నిర్మాణాలకు ప్రధానమంత్రి భూమి పూజ చేస్తారని చెప్పారు.





ఆహ్లాదంగా పర్యాటక హోటళ్లు..

జిల్లాలో ఏపీ పర్యాటకాభివృద్ధి సంస్థ హోటళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. గతంలో 304 గదులుండేవి. రుషికొండపై కూల్చివేతల తర్వాత ఆ సంఖ్య 249కి పడిపోయింది. విశాఖ డివిజన్ ఆధ్వర్యంలో పర్యాటక ప్యాకేజీలు నిర్వహిస్తుండగా కొన్నింటికి మంచి డిమాండు ఉంటోంది. కొత్త బస్సులు, కార్లు ఏర్పాటు చేస్తే వీటికి మరింత స్పందన రానుంది.



దారి లేక తప్పని మోత


ట్రాన్స్‌ఫార్మర్ మోసుకొస్తున్న గిరిజనులు


పాడేరు. న్యూస్‌టుడే: మన్యంలో రోడ్డు సదుపాయం లేక గిరిజనులకు అవస్థలు తప్పడం లేదు. మోదపల్లి పంచాయతీ ఉబ్బపలం గ్రామంలో సుమారు 20 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. ఆ గ్రామంలో విద్యుత్తు సదుపాయం కల్పించేందుకు భారీ బరువు ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌ని గురువారం అతి కష్టంగా స్థానిక గిరిజనులు అడవిలో మూడు కిలోమీటర్లు మోసుకువెళ్లారు. డల్లాపల్లి రోడ్డు నుంచి ఉబ్బపలం గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: రొంపల్లి పంచాయతీ పరిధిలోని బురుగ, చినకోనెల గ్రామాలకు విద్యుత్తు లైన్ల ట్రయల్ రన్ గురువారం నిర్వహించారు. అన్ని స్తంభాలకు విద్యుత్తు సరఫరా అవుతుందా లేదా అని ఏఈ రామలింగేశ్వరరావు నేతృత్వంలో లైన్‌మెన్లు పరిశీలించారు. ఏఈ మాట్లాడుతూ.. ఆదివాసీలకు ఉచితంగా విద్యుత్తు కనెక్షన్లు వేస్తున్నామని పేర్కొన్నారు. లైన్ ఇన్‌స్పెక్టర్ ఆనంద్, అప్పలరావు పాల్గొన్నారు.

'గమ్య నగరం'గా పర్యాటకుల మనసుదోచుకున్న విశాఖలో చూడదగ్గ ప్రాంతాలెన్నో.

విశాఖ సాగర తీరం... ప్రాచీన కట్టడాలు... నవీన నిర్మాణాలు... హరితశోభ సంతరించుకున్న సహజసిద్ధ కొండలు... బీచ్ రోడ్డులో సబ్‌మెరైన్, యుద్ధ విమానాలు... ఇలా చెప్పుకుంటూ వెళ్తే ఎన్నో. వీటి ఆధారంగా ఆతిథ్య, రవాణా రంగాలు కొన్ని వేల మందికి ఉపాధి కల్పిస్తున్నాయి.

'కూటమి' ప్రభుత్వం పర్యాటక రంగంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్న నేపథ్యంలో మరిన్ని సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. నేడు ప్రపంచ పర్యాటక దినోత్సవం నేపథ్యంలో 'ఉమ్మడి విశాఖ'లో ప్రత్యేకతలేంటో చూద్దామా.



గత వైకాపా ప్రభుత్వ హయాంలో పర్యాటకరంగం కుదేలైంది. రుషికొండ హిల్ రిసార్టు కూల్చేయడంతో ఆ శాఖపై తీవ్ర ప్రభావం కనిపించింది. పర్యాటక ఉత్సవాల నిర్వహణ చేపట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక పర్యాటక అనుబంధ రంగాలకు ఊపిరివచ్చినట్లయింది. ప్రభుత్వ విధానాల వల్ల క్రమేణ అన్ని రంగాలు పుంజుకుంటున్నాయి. పర్యాటక ప్రదేశాలకు వస్తున్న వారి సంఖ్య పెరుగుతోంది. కేంద్రం సహకారంతో కొత్తగా బొర్రాను అభివృద్ధి చేయనున్నారు. అరకు-లంబసింగి కారిడార్ పేరుతో బృహత్తర ప్రణాళిక పట్టాలెక్కనుంది.

ఆశాజనకంగా: విశాఖకు వచ్చే సందర్శకుల సంఖ్య క్రమేణ పెరుగుతోంది. పర్యాటకం ద్వారా స్థానికులకు ఉపాధి అవకాశాలు పెంచితే ఎంతో మార్పు కనిపిస్తుంది. చేతివృత్తులు, ఆహార వంటకాల ద్వారా ప్రోత్సహించొచ్చు. గ్రామీణ ప్రాంతాలను పర్యాటకానికి అనుసంధానం చేయాలి. వారసత్వ ప్రదేశాలను విదేశీయులకు పరిచయం చేయాలి. ఇప్పుడిప్పుడే ఈ రంగం పుంజుకుంటోంది. భవిష్యత్తు ఆశాజనకంగా ఉండనుంది.
– ఎం.వి.పవన్‌కార్తీక్, ఏపీ పర్యాటక సమాఖ్య కార్యదర్శి





నేడు పర్యాటక ప్రాంతాల్లో ఉచిత ప్రవేశం

పెదవాల్తేరు, న్యూస్‌టుడే : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకొని వి.ఎం.ఆర్.డి.ఎ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు పర్యాటక ప్రాంతాల్లో ఉచిత ప్రవేశం కల్పిస్తున్నట్లు వి.ఎం.ఆర్.డి.ఎ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ తెలిపారు. శుక్రవారం వుడా పార్కు, కైలాసగిరి, డాక్టర్ వై.ఎస్.ఆర్ సెంట్రల్ పార్కు, తెలుగు మ్యూజియం, సబ్‌మెరైన్, టి.యు.142, సీ హారియర్ మ్యూజియం తదితర సందర్శన ప్రాంతాల్లో ప్రవేశం ఉచితమన్నారు. ఈ అవకాశాన్ని నగరవాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గోదావరిలో చేపల వేటపై అధికారుల తనిఖీలు


ఎ.వీరవరం వద్ద గోదావరిలో అధికారుల బృందం

స్పందనకు వందనం

దేవీపట్నం, న్యూస్‌టుడే: గోదావరిలో అక్రమ చేపల వేటపై మూడు శాఖల అధికారులు స్పందించారు. 'గోదావరిలో స్థానికేతరుల చేపల వేట' అనే శీర్షికన 'ఈనాడు'లో బుధవారం ప్రచురితమైన కథనానికి స్పందించిన అధికారులు పోలవరం ప్రాజెక్టు బ్యాక్ వాటర్ ముంపు గ్రామాల్లో పర్యటించారు. దేవీపట్నం ఎస్సై షరీఫ్ ఆధ్వర్యంలో అటవీ, మత్స్యశాఖల అధికారులు దండంగి, ఎ.వీరవరం, పోశమ్మగండి పరిసర ప్రాంతాల్లో తనిఖీలు చేశారు. చేపల వేటగాళ్లకు ముందుగానే కొంతమంది వ్యక్తుల ద్వారా సమాచారం చేరడంతో వారంతా మరో చోటకు పరుగులు తీశారు. అధికారులు మాత్రం ఆ ప్రాంతాల్లో తనిఖీలు చేసినప్పుడు కొన్ని పడవలను గుర్తించారు. కొంత మంది వ్యక్తులతోపాటు పడవలను అధికారులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

పొంగిన కొండవాగు


వెలగపల్లి వద్ద రహదారిపై కొండవాగు ప్రవాహం

దేవీపట్నం, న్యూస్‌టుడే: మండలంలో గురువారం సాయంత్రం కురిసిన వర్షానికి కొండవాగు ఉద్ధృతంగా పొంగింది. దీంతో దామనపల్లి నుంచి రంపచోడవరం వైపునకు రాకపోకలు నిలిచిపోయాయి. వెలగపల్లి పరిసర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి ఆర్అండ్‌బీ రహదారిపై వాగు ప్రవహించింది. చీకటిపడే వరకు ఉద్ధృతి తగ్గకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. వెలగపల్లి - గుంపెనపల్లి గ్రామాల మధ్య సీతపల్లి వాగులో ప్రవాహం తగ్గకపోవడంతో గుంపెనపల్లితోపాటు లక్ష్మీపురం గిరిజనులు కొన్ని రోజులుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అటవీ పర్యటకాన్ని అభివృద్ధి చేస్తాం

కృష్ణాపురంలో ఆర్చరీ క్రీడలు ప్రారంభిస్తున్న సీసీఎఫ్

చింతపల్లి, న్యూస్‌టుడే: అడవుల సంరక్షణతోపాటు అటవీ పర్యటకాన్ని అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని విశాఖ సర్కిల్ అటవీశాఖ ముఖ్య సంరక్షణాధికారి శ్రీకంఠనాథరెడ్డి అన్నారు. గురువారం చింతపల్లి మండలంలో పర్యటించిన ఆయన చింతపల్లి డీఎఫ్‌ఓ సూర్యనారాయణతో కలసి కృష్ణాపురంలో నిర్మించిన అటవీ పర్యటక ప్రాజెక్టులను ప్రారంభించారు. ఎకో, అగ్రి టూరిజం ప్రాజెక్టులను పరిశీలించారు. అడవులకు నష్టం కలగకుండా ఏర్పాటు చేసిన ఆర్చరీ, ఊయలలు, ఫొటోషూట్, గుడారాలు, తదితర ప్రాజెక్టులను పరిశీలించి పలు సూచనలు చేశారు. అటవీ పర్యటకంలో గిరిజనులను భాగస్వాములు చేయాలన్నారు. పాలిథిన్, ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధించాలని పేర్కొన్నారు. సీజనులో మన్యానికి వచ్చే పర్యటకులతో మొక్కలు నాటించాలన్నారు. అటవీశాఖ పరిధిలో ఉన్న లంబసింగి, దారకొండ ఘాట్‌రోడ్లలోని బోడకొండమ్మ, దారాలమ్మ ఆలయాలను టెంపుల్ టూరిజం ప్రాజెక్టు కింద అభివృద్ధి చేసే ఆలోచన ఉందని తెలిపారు. దీనికి సంబంధించి ప్రతిపాదనలు చేస్తున్నామన్నారు. రేంజి అధికారులు అప్పారావు, ఎల్‌బీకే పాత్రుడు, భార్గవవర్మ, శివరంజని, శ్రీనివాసరావు, సెక్షన్ అధికారి అప్పారావు, సిబ్బంది పాల్గొన్నారు.

సీలేరు, న్యూస్‌టుడే: ధారకొండ అటవీ సెక్షన్ పరిధిలో ప్లాంటేషన్ పనులను సీసీఎఫ్ గురువారం ఉదయం పరిశీలించారు. ప్రణాళికబద్ధంగా పనులు నిర్వహించాలని సూచించారు. అనంతరం టేకు తోటలను పరిశీలించారు. సీలేరు రేంజి అధికారి శ్రీనివాసరావు, డీఆర్వో సింహాచలం పడాల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పీవో చొరవతో విద్యార్థి ఆసుపత్రికి తరలింపు


విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పోలీసులు

కొయ్యూరు, న్యూస్‌టుడే: ఇంటి వద్ద అనారోగ్యంతోనున్న విద్యార్థిని ఐటీడీఏ పీవో అభిషేక్ చొరవతో ఆసుపత్రికి తరలించారు. డౌనూరు బాలుర ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న కొర్రా సురేష్ వినాయక చవితికి స్వగ్రామం చింతపల్లి మండలం కుంబిడిసింగి వెళ్లాడు. అనారోగ్యం పాలైన విద్యార్థిని కుటుంబసభ్యులు మూఢనమ్మకాలతో ఆసుపత్రికి తీసుకెళ్లలేదు. సురేష్ వసతిగృహానికి రాకపోవడంతో వార్డెన్ విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్ చేయడంతో ఈ విషయం తెలిసింది. ఏటీడబ్ల్యూవో క్రాంతికుమార్‌కు వార్డెన్, హెచ్‌ఎం బుధవారం ఈ విషయాన్ని తెలిపారు. క్రాంతికుమార్ ఐటీడీఏ పీవో దృష్టికి తీసుకెళ్లారు. పీవో ఆదేశాలతో హెచ్‌ఎం, ఏటీడబ్ల్యూవో రాత్రి సమయంలో కుంబిడిసింగి వెళ్లి విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడి తాజంగి పీహెచ్‌సీకి తరలించారు. అక్కడినుంచి నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రికి తరలించారు. నర్సీపట్నం ఆసుపత్రి నుంచి ఇంటివెళ్లిపోతామని విద్యార్థి తల్లిదండ్రులు అధికారులతో గొడవకు దిగారు. పోలీసుల సహకారంతో బాలుడికి వైద్యసేవలందిస్తున్నారు. సురేష్ ఆరోగ్యం నిలకడగానే ఉందని క్రాంతికుమార్ తెలిపారు.

పొలంలో జిగురు అట్టలతో పురుగులు దూరం


మొంజాపుట్టులో పొలంబడిపై అవగాహన కల్పిస్తున్న ఏఓ శ్రీనివాసబాబు

ముంచంగిపుట్టు, న్యూస్‌టుడే: పంటకు నష్టం కలిగించే పురుగుల కదలికలను, ఉద్ధృతిని గుర్తించి వాటి నివారణకు పసుపురంగులో ఉన్న జిగురు అట్టలు ఏర్పాటు చేసుకోవాలని మండల వ్యవసాయశాఖ అధికారి శ్రీనివాసబాబు అన్నారు. గురువారం జోలాపుట్టు పంచాయతీలోని మొంజాపుట్టులో రైతులతో నిర్వహించిన పొలంబడి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయ, ఉద్యాన సహాయకులు ఆనంద్, తరుణ్, గోపాల్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలం డి.వెలమలకోటలో గురువారం 'పొలంబడి' కార్యక్రమాన్ని నిర్వహించారు. గిరిజన రైతులకు ప్రకృతి వ్యవసాయ ప్రతినిధి కుంజం నందిని జిల్లేడు ద్రావణాన్ని తయారు చేసే విధానాన్ని వివరించారు. మండల వ్యవసాయాధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయశాఖ సిబ్బంది, గిరిజన రైతులు పాల్గొన్నారు.

జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: జాబ్‌కార్డుదారులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఉపాధి హామీ పీడీ శివయ్య పేర్కొన్నారు. గురువారం పెదబయలులోని వెలుగు కార్యాలయంలో ఏపీవో పెదప్పలనాయుడితో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. పీడీ మాట్లాడుతూ.. 150 పనిదినాలు కల్పించాలని, వేతన బకాయిలు చెల్లించాలన్నారు. ముందుగా గలగండ పంచాయతీ మంగబంధలో ఉపాధి పనులు పరిశీలించారు. వేతనదారులు సమయపాలన పాటించాలన్నారు. డీఆర్పీ షణ్ముఖ, ఈసీ సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందితో సమావేశమైన పీడీ శివయ్య తదితరులు

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు చర్యలు


చింతపల్లి డిగ్రీ కళాశాల విద్యార్థులు నిర్వహించిన ఫుడ్‌ఫెస్టివల్‌లో ప్రిన్సిపల్ విజయభారతి తదితరులు

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: విద్యార్థులు స్వయం ఉపాధి, మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకోవాలని చింతపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయభారతి అన్నారు. గురువారం స్థానిక డిగ్రీ కళాశాల ఆవరణలో ఫుడ్ ఫెస్టివల్ నిర్వహించారు. విద్యార్థులు వేర్వేరు వంటకాలు ప్రదర్శించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థుల్లో నైపుణ్యాలు పెంపొందించేందుకు ఫుడ్ ఫెస్టివల్ ఏర్పాటు చేశామన్నారు. విద్యార్థులు చేసిన వంటకాలు అత్యంత రుచికరంగా ఉన్నాయని కొనియాడారు. వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసపాత్రుడు, అధ్యాపకులు లీలాపావని, రమణ, నాయక్, జగదీశ్‌బాబు, జగత్‌రాయ్ తదితరులు పాల్గొన్నారు.

అరకులోయలో తనిఖీలు

అరకులోయ, న్యూస్‌టుడే: గంజాయి రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని శిక్షణ డీఎస్పీ ఉషశ్రీ హెచ్చరించారు. అరకులోయలోని ప్రధాన రహదారిలో గురువారం డాగ్ స్క్వాడ్‌తో వాహనాలు తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ.. గిరిజన ప్రాంతంలో గంజాయి వ్యాపారులు కొంతమంది గిరిజనులను పావులుగా చేసుకొని వ్యాపారాన్ని సాగిస్తున్నారన్నారు. సీఐ హిమగిరి, పోలీసులు పాల్గొన్నారు.

78 కేజీల గంజాయి పట్టివేత

కె.కోటపాడు: కారులో తరలిస్తున్న 78 కేజీల గంజాయిని కె.కోటపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. ఎస్సై ధనుంజయ్ తెలిపిన వివరాల ప్రకారం.. బత్తివానిపాలెం కూడలిలో వాహన తనిఖీలు చేస్తుండగా ఓ కారులో గంజాయి పట్టుబడిందన్నారు. ఛత్తీస్‌గఢ్‌కు చెందిన జి.దేవానంద్, ఒడిశాకు చెందిన సుఫారి మండల్‌ను అదుపులోకి తీసుకున్నారు. గంజాయి విలువ రూ.4 లక్షల వరకు ఉంటుందన్నారు..

బైకు బోల్తా.. ఇద్దరికి గాయాలు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: ద్విచక్రవాహనం అదుపుతప్పి బోల్తా పడి ఇద్దరికి గాయాలయ్యాయి. కుంతుర్ల గ్రామానికి చెందిన కృష్ణారావు, సింహాద్రి బైకుపై గురువారం పాడేరు బయలుదేరారు. చింతలవీధి సమీపంలో బైకు అదుపు తప్పి ప్రమాదానికి గురైంది. గాయాలపాలైన ఇద్దరిని అంబులెన్సులో పాడేరు జిల్లా ఆసుపత్రికి తరలించారు.

అంగన్‌వాడీలకు సకాలంలో చేరని సరకులు

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అంగన్‌వాడీల సమస్యలపై గతంలో 42 రోజుల సమ్మె సమయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారుల ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఏపీ అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె సుబ్బారావమ్మ డిమాండ్ చేశారు. అరకులోయ గిరిజన సంఘం కార్యాలయంలో సంఘ జిల్లా విస్తృత స్థాయి సమావేశం గురువారం నిర్వహించారు. సుబ్బారావమ్మ మాట్లాడుతూ. ఏజెన్సీ ప్రాంతంలో అంగన్‌వాడీ కేంద్రాలకు సకాలంలో సరకులు చేరడం లేదన్నారు. మండల కేంద్రాల్లో సరకులు ఇవ్వడంతో అంగన్‌వాడీలకు తరలించేందుకు సిబ్బందిపై ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉమామహేశ్వరరావు, సంఘ నాయకులు నాగమ్మ, కళావతి, కొండమ్మ, ఈశ్వరమ్మ, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు ఇప్పించండి మహాప్రభో..!

ఎటపాక, న్యూస్‌టుడే: ఎటపాక పంచాయతీ లక్ష్మీదేవిపేట ఎస్సీ కాలనీలో మూడు రోజులుగా కుళాయి నీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సాంకేతిక సమస్యలు సరిచేసి తాగునీరు ఇప్పించాలని పంచాయతీ కార్యాలయంలో పలు మార్లు విన్నవించినా కార్యదర్శితోపాటు సంబంధిత అధికారులు స్పందించడం లేదని ఎస్సీ కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. కాలనీలోని మహిళలంతా పాడైపోయిన గేట్‌వాల్ సమీపంలో గురువారం ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. అధికారులు స్పందించి గేట్‌వాల్ మరమ్మతులు చేయించి, పగిలిపోయిన పైప్‌లైన్ సరిచేసి తాగునీరు ఇప్పించాలని కోరారు. దీనిపై చింతూరు ఐటీడీఏ పీఓకి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు.


ఖాళీ బిందెలతో లక్ష్మీదేవిపేట ఎస్సీ కాలనీవాసుల నిరసన

జాతీయ సదస్సులో మన్యం సర్పంచులు

దిల్లీలో జరిగిన సమావేశంలో దాసుబాబు, పాండురంగస్వామి తదితరులు

అరకులోయ, న్యూస్‌టుడే: 'పెసా' చట్టంపై దేశ రాజధాని దిల్లీలో గురువారం నిర్వహించిన జాతీయ స్థాయి సదస్సులో మన్యం సర్పంచులు పాల్గొన్నారు. పెసా చట్టం అమలు, అవగాహన తదితరాలపై కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన ఈ సమావేశంలో పెదలబుడు సర్పంచి పెట్టెలి దాసుబాబు, ముంచంగిపుట్టు మండలం దారెల పంచాయతీ సర్పంచి పాండురంగస్వామి తదితరులు పాల్గొన్నారు. ఐదో షెడ్యూల్ అమలవుతున్న 10 రాష్ట్రాల నుంచి ప్రతినిధులు దీనికి హాజరయ్యారు.

సప్పర్లలో వైద్య శిబిరం

సీలేరు, న్యూస్‌టుడే: గిరిజన సంఘం ఆధ్వర్యంలో గురువారం గాలికొండ పంచాయతీ సప్పర్లలో వైద్య శిబిరం నిర్వహించారు. ప్రజా ఆరోగ్యవేదిక, శారదా ట్రస్ట్, అల్లూరి విజ్ఞాన కేంద్రం, మెడికవర్ సహకారంతో దీన్ని ఏర్పాటు చేశారు. సుమారు 210 మందికి శిబిరంలో వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్, వైద్య నిపుణులు జి.భాగ్యరాజు, శ్రావణ్‌కుమార్, ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర నాయకులు కామేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు బుజ్జిబాబు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తం

కూనవరం, న్యూస్‌టుడే: విద్యార్థుల ఆరోగ్యంపై ఉపాధ్యాయులంతా అప్రమత్తంగా ఉండాలని ఏటీడబ్ల్యూవో కె.సుజాత సూచించారు. నర్సింగపేట బాలికలు, రేపాక బాలుర ఆశ్రమ పాఠశాలలను గురువారం ఆమె తనిఖీ చేశారు. నర్సింగపేటలో విద్యార్థినులతో కలసి భోజనం చేసి వంటల నాణ్యతను పరిశీలించారు. రేపాకలో విద్యార్థుల సామర్థ్యాలను పలు ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.

రంగంలోకి డాగ్‌స్క్వాడ్.. కొనసాగుతున్న గాలింపు

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి జలపాతంలో గల్లంతైన వైద్య విద్యార్థి సీహెచ్ హరదీప్ (20) ఆచూకీ కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా సాగుతున్నాయి. గాలింపు చర్యలను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ, ఏఎస్పీ జగదీశ్ అడహళ్లి, జిల్లా అటవీశాఖ అధికారిణి బబిత గురువారం స్వయంగా పర్యవేక్షించారు. అయిదు రోజులుగా పోలీసు, రెవెన్యూ, అటవీశాఖ బృందాలతోపాటు, కేంద్ర, రాష్ట్ర విపత్తుల బృందాలు (ఎన్డీఆర్ఎఫ్) నిర్విరామంగా గాలిస్తున్నాయి. ఇందుకోసం డ్రోన్లు కూడా వినియోగిస్తున్నారు. గురువారం నుంచి డాగ్ స్క్వాడ్‌లను రంగంలోకి దింపారు.


వైద్య విద్యార్థి ఆచూకీ కోసం డాగ్ స్క్వాడ్‌లతో గాలిస్తున్న ప్రత్యేక దళాలు

పీఎం జన్‌మన్‌తో అభివృద్ధి కార్యక్రమాలు


సమావేశంలో వివిధ శాఖల అధికారులు

రంపచోడవరం, న్యూస్‌టుడే: ఏజెన్సీలో ఆదివాసీల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టాయని ఐటీడీఏ ఏపీవో డీఎన్వీ రమణ పేర్కొన్నారు. స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం వివిధ శాఖలకు చెందిన అధికారులతో సంక్షేమ కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీవో మాట్లాడుతూ ఐటీడీఏ పీవో సింహాచలం ఆదేశాల మేరకు అక్టోబర్ రెండున పలు అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు పీఎం జన్‌మన్ పథకం ద్వారా గృహ నిర్మాణాలు, తాగునీరు, రహదారులు, విద్యుత్తు, విద్య, వైద్యం, అంతర్జాల సేవలు తదితర అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ముఖ్యంగా ఆదివాసీల అభివృద్ధి కార్యక్రమాలపై అక్టోబర్ 2న ప్రధాన మంత్రి దిల్లీ నుంచి నిర్వహించే దూరదృశ్య కార్యక్రమానికి మండలానికి పది మంది చొప్పున రంపచోడవరం ఐటీడీఏకు తీసుకురావాలన్నారు. జీసీసీ డీఎం పార్వతీశ్వరరావు, డీఎల్‌డీవో కోటేశ్వరరావు, పీహెచ్‌వో చిట్టిబాబు, ఐటీడీఏ ఈఈ శ్రీనివాసరావు పీఏవో రాంబాబు, ఉపాధిహామీ ఏపీడీ శ్రీనివాసరావు, ఎంపీడీవో హరికృష్ణ, సీడీపీవో సంధ్యారాణి తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

(కిలోకి - రూ.లలో)

	వెన్‌కాబ్	బ్యాగ్
ఫారం గేటు	107	98
లైవ్	129	118
డ్రెస్‌డ్	187	206
స్కిన్‌లెస్	213	216

గోతుల రోడ్లతో ఇక్కట్లు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: పెదబయలు, ముంచంగిపుట్టు మండలాలను కలుపుతూ నిర్మించిన రహదారి గుంతలు ఏర్పడి అధ్వానంగా దర్శనమిస్తోంది. కుజభంగి కూడలి నుంచి రూఢకోట వరకు గత ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం రూ.ఐదు కోట్లతో రోడ్డు పనులు చేపట్టింది. ఈ రోడ్డుపై గుంతలు పడి వాహనదారుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని కుజభంగి, బుంగాపుట్టు, పర్రెడ, పెద్దపుట్టు, పెద్దపుట్టు గాటీల్లో పెద్ద గోతులతో దర్శనమిస్తున్నాయి. ఈ రోడ్డు మీదుగా వెళ్లేందుకు వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రూఢగోమంగి సమీపంలో గాటీలో వర్షాలకు పెద్ద గొయ్యి ఏర్పడింది. ఈ రహదారిలో అత్యవసర సమయాల్లో 108 వాహనాలు వెళ్లేందుకు ఇక్కట్లు తప్పడంలేదు. పాడేరు ఆర్‌అండ్‌బీ ఈఈ రామ్‌నంద్ బాబును వివరణ కోరగా రోడ్డు మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తామని తెలిపారు.


పెద్దపుట్టు సమీపంలో కోతకు గురైన రోడ్డు


పర్రెడ సమీపంలో పెద్ద పెద్ద గోతులతో ఇలా..

అధ్వానంగా వేములకొండ-తున్నూరు మార్గం

రంపచోడవరం, న్యూస్‌టుడే: రంపచోడవరం మండలం వేములకొండ నుంచి దేవీపట్నం మండలం తున్నూరు వెళ్లే రోడ్డు గుంతలుపడి అధ్వానంగా మారింది. ఏడు కిలోమీటర్ల మేర ఈ రోడ్డు వేయాలని గతంలో పలుమార్లు ప్రజాప్రతినిధులకు, ఐటీడీఏ అధికారులకు గిరిజనులు విన్నవించారు. అయితే రోడ్డు నిర్మాణానికి ఎటువంటి చర్యలు చేపట్టలేదు. రోడ్డు గుంతలు పడి రాళ్లు లేచిపోయి ఉండటంతో అనారోగ్యానికి గురైతే అత్యవసర పరిస్థితుల్లో వైద్యం నిమిత్తం ఆసుపత్రికి వెళ్లేందుకు గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆరేళ్ల క్రితం గ్రావెల్ రోడ్డు మంజూరైనా నాసిరకంగా పనులు చేపట్టడంతో ఆరు నెలలకే పూర్తిగా శిథిలమైంది. దీంతోపాటు ఇటీవల కురిసిన వర్షాలతో రోడ్డు పూర్తిగా గుంతలుపడి రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఒకప్పుడు కాసుల వర్షం.. నేడు నిరుపయోగం

నదిలోనే లాంచీలను వదిలేసిన నిర్వాహకులు


గోదావరి నదిలో వదిలేసిన లాంచీలు

దేవీపట్నం, న్యూస్‌టుడే: ఒకప్పుడు గోదావరి నదిపై ప్రయాణం చేయాలంటే ముందుగా గుర్తుకువచ్చేవి లాంచీలు. రాజమహేంద్రవరం నుంచి పాపికొండలు, పశ్చిమగోదావరి జిల్లా నుంచి గండిపోశమ్మ ఆలయానికి, గోదావరి నది పరీవాహక ప్రాంతాల్లో పోశమ్మగండి నుంచి కొండమొదలు వరకు ఇలా ఎక్కడికి వెళ్లాలన్నా ప్రజలు లాంచీలపైనే నిత్యం రాకపోకలు సాగించేవారు. నిత్యావసర సరకులు సైతం నిత్యం మైదాన ప్రాంతాల నుంచి ఏజెన్సీ ప్రాంతాలకు లాంచీలపైనే తరలించేవారు. వీటి నిర్వాహకులతో పాటు అనేక మంది సిబ్బంది వీటిపై ఆధారపడి ఉండేవారు. గతంలో కొండమొదలు పరిసర ప్రాంతాల్లో రహదారి సౌకర్యం లేకపోవడంతో గర్భిణులను లాంచీలపైనే ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించేవారు. లాంచీలో ప్రసవమైనా, ఆసుపత్రిలో ప్రసవమైనా కొంతమంది వారికి పుట్టిన పిల్లలకు లాంచీల పేర్లు పెట్టే వారంటే లాంచీలు అంత సెంటిమెంట్ ఉండేది. అయితే కచ్చులూరు మందం వద్ద పర్యటక బోటు ప్రమాదం అనంతరం ప్రభుత్వం వీటి అనుమతులు పూర్తిగా నిలిపివేసింది. దీంతో అప్పట్లో కాసుల వర్షం కురిపించిన లాంచీలు గోదావరి నదిలో జరిగిన ప్రమాదాలు కారణంగా ప్రస్తుతం మూలకు చేరాయి. ఎంతో ఆదాయం తెచ్చిపెట్టిన వీటిని అమ్మాలన్నా కొంత మంది నిర్వాహకులకు సెంటిమెంట్ కారణంగా అలానే వదిలేశారు. ఇటీవల గోదావరి ఉద్ధృతి కారణంగా పోశమ్మగండి వద్ద ఒక లాంచీపై మరొకటి చేరాయి. దీంతో నది మధ్యలో ప్రమాదకరంగా ఉన్నాయి.

లక్ష్య సాధనకు నిరంతర కృషి


మారేడుమిల్లిలోని ఏకలవ్య పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న పీఓ, సబ్ కలెక్టర్

మారేడుమిల్లి, న్యూస్‌టుడే: విద్యార్థులంతా చిన్నతనం నుంచే లక్ష్యాలు నిర్దేశించుకుని, వాటిని సాకారం చేసుకోవడానికి శక్తివంచన లేకుండా పాటు పడాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కట్టా సింహాచలం, సబ్ కలెక్టర్ కల్పశ్రీ సూచించారు. మారేడుమిల్లిలోని 'ఏకలవ్య' మోడల్ గురుకుల పాఠశాలను గురువారం వారు ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదులను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. ఉపాధ్యాయులు బోధిస్తున్న పాఠాలు అర్థం అవుతున్నాయా లేదా.. అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, ఇటీవలి రెండుసార్లు బోధించడం ద్వారా వారి మనస్సులకు హత్తుకోవాలన్నారు. విద్యాలయాల ప్రాంగణాల్లోకి ఎట్టి పరిస్థితుల్లోనూ బయటి వ్యక్తులను అనుమతించొద్దని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మెనూ అమలు చేయాలని, సిబ్బంది సకాలంలో విధులకు హాజరు కావాలని అన్నారు. పాఠశాల ఆవరణలో పరిశుభ్రత కార్యక్రమాలను పగడ్బందీగా నిర్వహించాలన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే మాత్రం కఠిన చర్యలు తప్పవని పీఓ, సబ్ కలెక్టర్ హెచ్చరించారు.

క్రీడలతో మానసికోల్లాసం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని ఎంపీపీ శెట్టి నీలవేణి, జడ్పీటీసీ సభ్యుడు గంగరాజు, ఎస్టీ కమిషన్ సభ్యులు రామ లక్ష్మి అన్నారు. శివలింగపురంలోని గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల ఆవరణలో ఐక్య ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు క్రీడా పోటీలను గురువారం ప్రారంభించారు. వారు మాట్లాడుతూ.. విద్యార్థులు, ఉపాధ్యాయులు క్రీడాస్ఫూర్తి అలవర్చుకోవాలన్నారు. సంఘ జిల్లా కార్యదర్శి పూడి దేముడు, మండల అధ్యక్షుడు ఈశ్వరరావు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల క్రీడలతో స్నేహపూర్వకమైన వాతావరణం ఏర్పడుతుందని చెప్పారు. సంఘ ఉమ్మడి జిల్లా ఉప అధ్యక్షుడు రాంబాబు, కొండబాబు, సత్యనారాయణ, పడాల్, ఉషారాణి, హైమావతి తదితరులు పాల్గొన్నారు.


పోటీలు ప్రారంభిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యుడు తదితరులు

విద్యుత్తు సరఫరాకు అంతరాయం నేడు

మారేడుమిల్లి, రాజవొమ్మంగి, న్యూస్‌టుడే: మారేడుమిల్లి మండలంలోని అన్ని పంచాయతీలకు శుక్రవారం విద్యుత్తు సరఫరా నిలిపి వేస్తామని, వినియోగదారులంతా సహకరించాలని ట్రాన్స్‌కో ఈఈ ఎండీ యూసఫ్ కోరారు. రాజవొమ్మంగి మండలం అమినాబాద్, చెరుకుంపాలెం, చికిలింత, జడ్డంగి, లోదొడ్డి, మారేడుబాక, వాతంగి, వంచంగి తదితర గ్రామాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిపివేస్తున్నందున వినియోగదారులు సహకరించాలని డీఈఈ బి.దివాకర రావు కోరారు.

బాధిత కుటుంబాలకు సాయం

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గిరిజన సహకార సంస్థలో ఒప్పంద సేల్స్‌మెన్లుగా పని చేస్తున్న కిముడు అప్పారావు, అన్నప్ప ఈ నెల 20న మృతి చెందారు. తోటి సేల్స్‌మెన్లు బాధిత కుటుంబాలకు ఆర్థికసహాయం అందజేశారు. సంఘ మండల అధ్యక్షుడు రామారావు, నెహ్రూ, మల్లుపడాల్, కుమారి, దుర్గారాణి తదితరులు పాల్గొన్నారు.

కూనవరం,న్యూస్‌టుడే: కూనవరంలో ఇటీవల మృతి చెందిన మోర బాలమ్మ కుటుంబాన్ని తెదేపా నాయకులు గురువారం పరామర్శించారు. జేకే ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ జమాల్‌ఖాన్ పంపిన రూ.అయిదు వేలను మృతురాలి కుమారుడికి అందించారు. తెదేపా నియోజకవర్గ అధికార ప్రతినిధి ఎడవల్లి భాస్కరరావు, ఎచ్చు రాము, చెలికాని ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గోడ నిర్మాణంపై విచారణ

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: పెదవలసలో గృహాల వద్ద గోడ నిర్మాణంతో స్థానికుల ఇక్కట్లపై రెవెన్యూ అధికారులు విచారణ చేపట్టారు. జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా గ్రామంలో పన్నెండు అడుగుల గోడ నిర్మించడంతో ఇళ్లకు, దుకాణాలకు వెళ్లేందుకు ఇక్కట్లు ఎదురవుతున్నాయి. స్థానికులు జిల్లా కలెక్టర్ దృష్టికి ఈ సమస్యను తీసుకువెళ్లారు, ఈ నేపథ్యంలో తహసీల్దార్ ప్రసాద్, ఉప తహసీల్దార్ కుమారస్వామి, ఆర్ఐ మహదేవ్, వీఆర్ఓ గంగాభవాని, సర్వేయర్లు గురువారం విచారణ చేపట్టారు. జిల్లా కలెక్టర్‌కు నివేదిక అందిస్తామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు

పెదబయలు గ్రామీణం, న్యూస్‌టుడే: శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని సీఐ వెంకటరావు అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. మండల కేంద్రంలో ఇటీవల గొడవపడిన రెండు వర్గాల ఉపాధ్యాయులపై కేసులు నమోదు చేశామన్నారు. పోలీసులు అనుమతులు లేకుండా ర్యాలీలు, ధర్నాలు చేయకూడదన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సంచారంపై ఆందోళన

జి.మాడుగుల, న్యూస్‌టుడే: మద్దిగరువు వారపు సంతలో అనుమానాస్పదంగా కొంత మంది తిరుగుతున్నారని స్థానికుల సమాచారంతో పోలీసులు అక్కడకు చేరుకుని స్టేషన్‌కు తరలించి విచారించారు. బతుకుదెరువు కోసం గ్రామాల్లో తిరుగుతూ భిక్షాటన చేస్తున్నట్లు పోలీసులకు వారు తెలిపారు. పోలీసులు వారి వివరాలు సేకరించారు. సొంత గ్రామాలకు వెళ్లిపోవాలని వారికి సూచించారు.

ఆశ్రమాల్లో మెనూ అమలు తప్పనిసరి


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ అభిషేక్, ఇన్‌ఛార్జి డీడీ రజని

పాడేరు, న్యూస్‌టుడే: గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో తప్పనిసరిగా మెనూ అమలు చేయాలని ఐటీడీఏ పీఓ వి.అభిషేక్ ఆదేశించారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో ఏటీడబ్ల్యూఓలు, ప్రధానోపాధ్యాయులు, వార్డెన్లతో గురువారం సమావేశం నిర్వహించారు. పీఓ మాట్లాడుతూ.. ప్రధానోపాధ్యాయులే డిప్యూటీ వార్డెన్‌గా విధులు నిర్వహిస్తే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. ప్రతి నెలా మూడో శనివారం శ్రమదానంతో మన బడి పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో అంబులెన్సులు సమకూర్చడానికి కాల్ సెంటర్ ఏర్పాటు చేస్తామన్నారు. ఫోన్ నంబర్లు 089355137370, 63039 21374 నంబర్లకు కాల్ చేసి వైద్య సౌకర్యాలు పొందాలని సూచించారు. ఇన్‌ఛార్జి డీడీ రజని పాల్గొన్నారు.

దేవీపట్నం, న్యూస్‌టుడే: శరభవరం, ముసినిగుంట ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలను గిరిజన సంక్షేమశాఖ డీడీ ఐ.కొండలరావు తనిఖీ చేశారు. విద్యార్థులకు అందించే భోజనాలు పరిశీలించారు. విద్యతోపాటు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పోతవరం, కొత్తవీధి పాఠశాలను తనిఖీ చేశారు. ఏటీడబ్ల్యూఓ రామతులసి పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌రహిత సమాజానికి కృషి

పాడేరు పట్టణం, న్యూస్‌టుడే: ప్లాస్టిక్ రహిత సమాజానికి ప్రతిఒక్కరూ కృషి చేయాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ చిట్టబ్బాయి పేర్కొన్నారు. స్వచ్ఛతే సేవా కార్యక్రమాన్ని డిగ్రీ కళాశాల ప్రాంగణంలో గురువారం ప్రిన్సిపల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కళాశాల మైదానం, పరిసరాలను విద్యార్థులు, అధ్యాపకులు శుభ్రం చేశారు. ఎన్ఎస్ఎస్ పీవోలు డాక్టర్ బి.రమేష్‌బాబు, గణేష్, దామోదర్, గౌరీశంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.


చెత్త తొలగిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

సమస్యలు పరిష్కరించాలి


కాశీపట్నం గిడ్డంగి వద్ద కళాసీల నిరసన

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కాశీపట్నం జీసీసీ గిడ్డంగి వద్ద కళాసీలు గురువారం నల్లరిబ్బన్లు కట్టుకుని నిరసన చేపట్టారు. సంఘ నాయకుడు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ.. రూట్ మ్యాప్‌ను నిలిపేయాలని, కూలీలకు వేతనాలు పెంచాలని, ఎరియల్స్ ఇవ్వాలని, ప్రతి నెలా 10వ తేదీలోపు బిల్లులు చెల్లించాలని కోరారు. కళాసీలు పాల్గొన్నారు.

ఆదివాసీల ఇళ్లకు సౌర విద్యుత్తు సౌకర్యం

వై. రామవరం, న్యూస్‌టుడే: వై. రామవరం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కడబాల ఆనందరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సమావేశంలో ట్రాన్స్‌కో ఏఈ అబ్బాయిదొర మాట్లాడుతూ డాబా ఇళ్లు ఉండే వారికి సోలార్ విద్యుత్తు ఇచ్చేలా ప్రతిపాదనలు ఉన్నాయని తెలిపారు. ఆదివాసీలకు డాబా ఇళ్లు ఉండవని, రేకు, పెంకుటిళ్లు, తాటాకు ఇళ్లు ఉన్న వారికి కూడా సోలార్ విద్యుత్తు అందించేలా మార్పు చేయాలని ఎంపీపీ ఆనందరావు కోరారు. విద్యుత్తు తీగలు వల్ల మరణాలు సంభవిస్తున్నాయని వాటిపైనా దృష్టి సారించాలన్నారు. గిరిజన సంక్షేమ శాఖలో చేపడుతున్న పనులుపై సంబంధిత ఇంజినీర్ వివరిస్తుండగా ఎంపీటీసీ సభ్యుడు రమణ అభ్యంతరం వ్యక్తం చేశారు. కోట్లాది రూపాయలు వెచ్చించి నిర్మాణాలు చేపడుతున్న ఆయా నిర్మాణాల్లో పర్యవేక్షణ లేక నిధులు దుర్వినియోగం అవుతున్నాయని అన్నారు. ఎంపీడీఓ బాపన్నదొర మాట్లాడుతూ సంపూర్ణ పోషణ అభియాన్ పథకం అమలుకు సహకరించాలన్నారు. 50 సంవత్సరాలు నిండిన గిరిజనులు పింఛన్లకు దరఖాస్తు చేసుకోవచ్చుని, అందుకు అవసరమైన ధ్రువపత్రాలు సిద్ధం చేసుకోవాలిలని తెలిపారు. తహసీల్దారు అనసూయ మాట్లాడుతూ భూమి ఎక్కువగా ఉన్న వారికి రేషన్ రద్దు చేశామని, దీని వల్ల వారి యొక్క భూములకు మ్యుటేషన్ చేసుకొనే అవకాశం కలిగిందని తెలిపారు. ఎంఈఓ తాతబ్బాయి దొర, ఉపాధిహామీ పథకం ఏపీఓ సాయిబాబా, జడ్పీటీసీ సభ్యురాలు క్ర్రా వెంకటలక్ష్మి, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

మేమున్నాం.. మీకు తోడుగా..

పాడేరు 89853 66570, అరకులోయ 63034 86346, రంపచోడవరం 94908 77172



మారేడుమిల్లి, న్యూస్‌టుడే:

?: మారేడుమిల్లి నుంచి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారి మారేడుమిల్లి శివారులో పూర్తిగా ఛిద్రమైంది. అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలి. – లక్ష్మణ్, మారేడుమిల్లి

✔: మారేడుమిల్లి శివార్లలో ప్రధాన రహదారిపై ఏర్పడిన గోతులు పూడ్చడానికి చర్యలు చేపడతాం. వాహనదారులకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా చూస్తాం. – ప్రదీప్, ఏఈ, ర.భ.శాఖ, మారేడుమిల్లి

?: మండలంలోని లోతట్టు గ్రామాల నుంచి వచ్చే గిరిజనులు ప్రైవేటు వాహనాల టాపులపైనా ఎక్కి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. ప్రమాదాల నివారణకు తగు చర్యలు చేపట్టాలి. – గణేశ్‌కుమార్, మారేడుమిల్లి

✔: గిరిజనులు ప్రైవేటు వాహనాలపై ప్రమాదకరంగా ప్రయాణించకుండా తగిన చర్యలు చేపడతాం. – ఎన్.రాము, ఎస్సై, మారేడుమిల్లి

గృహ నిర్మాణాలపై అధికారుల సమీక్ష

చింతపల్లి గ్రామీణం, న్యూస్‌టుడే: గ్రామంలో నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎంపీడీవో ఆశాజ్యోతి అన్నారు. స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఉపాధి సిబ్బందితో సమావేశమయ్యారు. సిబ్బంది రమణ, రాజారావు తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక, న్యూస్‌టుడే: ప్రధానమంత్రి గ్రామీణ్ ఆవాస యోజన్‌లో మంజూరైన ఇళ్లను పూర్తిచేయాలని ప్రత్యేక అధికారి జి.మురళి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ముంచంగిపుట్టు: సరకులు అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపారులపై చర్యలు తప్పవని తూనికలు, కొలతలశాఖ ఇన్‌స్పెక్టర్ అనూరాధ అన్నారు. శుక్రవారం ముంచంగిపుట్టులో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఐదు కిరాణా దుకాణాల్లో అధిక ధరలకు విక్రయిస్తున్న వ్యాపారులపై కేసులు నమోదు చేశారు. సీల్ లేని కాటాను గుర్తించి కేసునమోదు చేశారు. అనుమతి లేని సరుకులను దిగుమతి చేసుకుని విక్రయించినా చర్యలు తప్పవన్నారు.


సీలు లేని కాటాను తనిఖీ చేస్తున్న ఇన్‌స్పెక్టర్ అనూరాధ

పేదల సంక్షేమమే ధ్యేయం


జీకేవీధిలో ప్రభుత్వ వంద రోజుల పాలనను వివరిస్తున్న ఎంపీడీవో, నాయకులు

అరకులోయ, డుంబ్రిగుడ, న్యూస్‌టుడే: పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా నియోజకవర్గ ఇన్‌ఛార్జి దొన్నుదొర అన్నారు. కొత్తభల్లుగుడలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమాన్ని పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి బాబూరావు అధ్యక్షతన నిర్వహించారు. నాయకులు నీరజ, బొరిబొరి లక్ష్మి, నిర్మల, పాడి చందు, సర్పంచి రాధిక, ఎంపీడీవో వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. డుంబ్రిగుడ మండలం కొర్రా, రంగిలిసింగి పంచాయతీల్లోని పెదపాడు, కుంజబంగి గ్రామాల్లో బూత్, యూనిట్ ఇన్‌ఛార్జుల బొంజుబాబు, ఆనందరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. పేద ప్రజల కోసం కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని తెదేపా మండల అధ్యక్షుడు సుబ్బారావు పేర్కొన్నారు. నేతలు స్వామి, త్రినాథరావు, చిన్నగెన్ను, చంటి పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం వంద రోజుల పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను అవగాహన కల్పించడమే ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం ఉద్దేశమని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. గూడెంకొత్తవీధిలో గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించారు. వైస్ ఎంపీపీ ఆనందరావు, ఎంపీటీసీ రాజేశ్వరి, నేతలు ముక్కలి రమేష్, జోగిరాజు, సిద్ధార్థమార్క్, రామకృష్ణ, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వం ఏర్పడిన వంద రోజుల్లోనే ఎన్నో మంచి పనులు చేసిందని తెదేపా మండల అధ్యక్షుడు జి.సత్యనారాయణ అన్నారు. గురువారం ఎం.మాకవరం గ్రామంలో ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తెదేపా ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కె.రామ్మూర్తి, నేతలు వరహాలబాబు, బాలరాజు, జ్యోతి, పుల్లయ్య, సన్యాసిరావు, ప్రసాద్ , బాలయ్య పాల్గొన్నారు.

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: కూటమి ప్రభుత్వంలో గిరిజన గ్రామాలు అభివృద్ధి చెందుతాయని ఎన్ఆర్‌పురం ప్రత్యేకాధికారి ఆర్ఐ పి.శంకరరావు అన్నారు. గ్రామ సచివాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. సర్పంచి బడ్నాయిన సన్నమ్మ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రామయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అచ్యుతాంబ, కార్యదర్శి అర్జున్ పాల్గొన్నారు.

▼కొత్తూరు గ్రామ సచివాలయం పరిధిలో తెదేపా మండల అధ్యక్షుడు బుజ్జిబాబు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కూటమి పాలనను వివరించారు. అరకులోయ లీగల్‌సెల్ అధ్యక్షులు రత్నరాజ్, సర్పంచి సారా సీతయ్య, పాల్గొన్నారు.

మోతుగూడెం, న్యూస్‌టుడే: బొడ్డగండి పంచాయతీ డొంకరాయి మార్కెట్ వీధిలో ఎంపీటీసీ సభ్యుడు కరకా వెంకటరమణ, నేతలు నీలాపు సత్యనారాయణ, గంగిరెడ్ల గురుమూర్తి, మావూరి సత్యనారాయణ, అనిల్, శివ ఇంటింటికీ వెళ్లి పథకాలు వివరించారు.

గంగవరం, న్యూస్‌టుడే: మొల్లేరులో నేతలు, ఉద్యోగులు ఇంటింటా తిరుగుతూ గడిచిన 100రోజుల పాలనలో ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించారు. తెదేపా మండలాధ్యక్షుడు పాము అర్జున్ సచివాలయ సిబ్బంది, తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


కొత్తభల్లుగుడలో మాట్లాడుతున్న దొన్నుదొర


డొంకరాయి మార్కెట్ వీధిలో..

జిల్లాస్థాయి పోటీలకు రేపాక విద్యార్థి



కూనవరం, న్యూస్‌టుడే: రంపచోడవరంలో జరిగిన అండర్ 14 పాఠశాలల క్రీడా పోటీలలో ప్రతిభ చూపిన రేపాక ఆశ్రమ పాఠశాల విద్యార్థి అప్క అంజిబాబు ఈ నెల 28న నిర్వహించనున్న జిల్లాస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. కబడ్డీ, వంద మీటర్ల పరుగు పందెం, షాట్‌పుట్ అంశాలలో జిల్లా స్థాయిలో పోటీ పడుతున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకట్ తెలిపారు..

ఎన్ఎస్ఎస్ పీవోకు పురస్కారం

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: విశాఖ ట్రావెల్, టూరిజం ఫౌండేషన్, టీవీ టూరిజం ఐదో వార్షికోత్సవం సందర్భంగా టీవీ టూరిజం ఎక్సలెన్స్ అవార్డును సెంటర్‌ఫర్ యోగా సంస్థ డైరెక్టరు, అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి వై విజయలక్ష్మికి ప్రదానం చేశారు. విశాఖలో జరిగిన కార్యక్రమంలో ఏపీటీడీసీ ప్రాంతీయ సంచాలకులు శ్రీనివాసఫణి, జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి చేతులమీదుగా ఈ అవార్డును అందుకున్నారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీ

అరకులోయ పట్టణం, న్యూస్‌టుడే: అరకులోయ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వచ్ఛతే సేవా కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ విభాగం, కేంద్ర కాఫీబోర్డు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, పాటల పోటీలు నిర్వహించారు. పచ్చదనం, పరిసరాల పరిశుభ్రతపై ప్రిన్సిపల్ చలపతిరావు, కాఫీబోర్డు జెఎల్ఓ వీవీకేఎం లక్ష్మి విద్యార్థులకు వివరించారు. కాఫీ బోర్డు సిబ్బంది రవికుమార్, శ్రీనివాసరావు, అధ్యాపక సిబ్బంది బాలరాజు పాల్గొన్నారు.

పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఆమోదం

అనంతగిరి గ్రామీణం, న్యూస్‌టుడే: టోకూరు పంచాయతీ పరిధిలోని తెంతెలగుడ సమీపంలో పెట్రోలు బంక్ ఏర్పాటుకు సర్పంచి కిల్లో మోస్య అధ్యక్షతన గురువారం పీసా కమిటీ సమావేశం నిర్వహించారు. కమిటీ సభ్యులు గంగులు, కృష్ణ పాల్గొన్నారు.

అక్రమ రవాణాపై నిఘా

దేవీపట్నం, న్యూస్‌టుడే: మండలంలో చేపలు, కలప, రేషన్ బియ్యం అక్రమ రవాణాను నివారించేందుకు వచ్చే నెల ఒకటి నుంచి మూడు శాఖల ఆధ్వర్యంలో జాయింట్ యాక్షన్ టీమ్‌ను ఏర్పాటు చేయనున్నామని తహసీల్దార్ రామకృష్ణ పేర్కొన్నారు. తహసీల్దార్ కార్యాలయంలో రేంజ్ అధికారి దుర్గాకుమార్, ఎస్సై షరీఫ్‌తో కలిసి మాట్లాడారు. కమిటీలో రెవెన్యూ, అటవీ, పోలీస్ శాఖల అధికారులతోపాటు గ్రామస్థాయిలో మత్స్య, అటవీ శాఖల సిబ్బంది వీఆర్ఏలు ఉంటారన్నారు.

జనసేనానికి మద్దతుగా ప్రాయశ్చిత్త దీక్ష

ఎటపాక, న్యూస్‌టుడే: తిరుమలలో శ్రీవారి లడ్డూ ప్రసాదం కల్తీపై ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చేపట్టిన ప్రాయశ్చిత్త దీక్షకు మద్దతుగా జనసేన మండల అధ్యక్షులు మారాసు గంగాధర్ ఆధ్వర్యంలో గురువారం ఒక్క రోజు దీక్ష చేపట్టారు. మండలంలోని వెంకటరెడ్డిపేట వెంకటేశ్వర ఆలయంలో శుద్ధి చేసి పూజలు నిర్వహించి ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టారు. సమరతసేవా ఆధ్యాత్మిక ప్రసంగీకులు సీలం పుల్లారెడ్డి ఆధ్యాత్మికతను గూర్చి వివరించారు. జనసైనికులు కొమ్ము వెంకట్, గోవిందు, జలగం శ్రీను, భాజపా నాయకులు నోముల రామారావు, పాయం వెంకయ్య, నలజాల శ్యామ్, చిన్న నాగమ్మ, పకీరమ్మ తదితరులు పాల్గొన్నారు.


ప్రాయశ్చిత్త దీక్ష చేపట్టిన జనసేన నాయకులు

కొత్త స్తంభం ఏర్పాటు చేయాలి

హుకుంపేట, న్యూస్‌టుడే: గొందిరాపలో మరమ్మతులకు గురై ప్రమాదకరంగా ఉన్న విద్యుత్తు స్తంభాన్ని మార్చి కొత్తది ఏర్పాటు చేయాలని జనసేన మండల అధ్యక్షుడు కోటేశ్వరరావుపడాల్ పేర్కొన్నారు. రాప పంచాయతీ గొందిరాప గ్రామాన్ని గురువారం సందర్శించి గ్రామంలో సమస్యలు తెలుసుకున్నారు. నాయకులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా చెకుముకి సైన్స్ పరీక్షలు

ఎటపాక, న్యూస్‌టుడే: యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్, ఆంధ్రప్రదేశ్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండలంలో నిర్వహించిన పాఠశాల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సాగర్, కె.శ్రీనివాసరావు మాట్లాడుతూ నెల్లిపాక, గొల్లగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో 65 మంది, నల్లకుంట ఆశ్రమ ఉన్నత పాఠశాలలో 100 మంది మొత్తం 165 మంది విద్యార్థులు పరీక్షలు రాశారని తెలిపారు. జనవిజ్ఞాన వేదిక సభ్యులు దర్మల మహేష్, తాటి రవి, ఎస్.రవితేజ, యం.భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.


నెల్లిపాక పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు

బాల్య వివాహాలను అరికడదాం

జి.మాడుగుల, న్యూస్‌టుడే: బాల్య వివాహాలు అరికట్టేందుకు ప్రతిఒక్కరూ సహకరించాలని సీడీపీవో సువర్ణమ్మ కోరారు. సొలభం, గడుతూరులో పోషకాహార మాసోత్సవాలు గురువారం నిర్వహించారు. పోషక విలువలు కలిగిన ఆహారాన్ని పిల్లలు, గర్భిణులు, బాలింతలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. సర్పంచి అప్పలమ్మ, సూపర్‌వైజర్లు లక్ష్మి, మణికుమారి, ఎం.లక్ష్మి, సత్యవతి, పద్మావతి, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


గడుతూరులో ర్యాలీ

కొయ్యూరు, న్యూస్‌టుడే: బూదరాళ్ల పంచాయతీ చౌడుపల్లిలో గర్భిణులకు సామూహిక సీమంతం చేశారు. పోషకాహార ప్రదర్శన ఏర్పాటు చేశారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, ఆరోగ్య సూత్రాలను సీడీపీవో విజయకుమారి, వైద్యసిబ్బంది వివరించారు. సర్పంచి ముత్యాలమ్మ, సూపర్‌వైజర్లు మహలక్ష్మి, సీనియర్ అసిస్టెంట్ ప్రవీణ్, వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

డీటీఎఫ్ నూతన కార్యవర్గం ఏర్పాటు

గూడెంకొత్తవీధి, న్యూస్‌టుడే: డెమోక్రటిక్ ఉపాధ్యాయ సమాఖ్య(డీటీఎఫ్) మండల అధ్యక్షుడిగా ఎస్. వినోద్, ప్రధాన కార్యదర్శిగా ఎం.లక్ష్మణ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆ సంఘం జిల్లా కమిటీ సభ్యులు జర్రా సింహాచలం, అధ్యక్షులు బి.వీరబాబు ఆధ్వర్యంలో గురువారం జీకేవీధిలో ఎన్నిక నిర్వహించారు. కార్యదర్శిగా జీవన్, ఉపాధ్యక్షులుగా కృష్ణప్రసాద్, శ్యాంసుందర్, మహిళా అధ్యక్షురాలిగా శాంతకుమారి, కోశాధికారిగా రవిప్రసాద్, ముఖ్య సలహాదారులుగా ముర్ల వెంకటరమణ, ఎస్ ప్రకాష్‌కుమార్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.